క్లుప్తంగా

అర్హులకు 'దళితబంధు' ఇవ్వాలి

మరికల్: జిల్లాలో అర్హులకు దళితబంధు ఇవ్వాలని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. ఎమ్మెల్యేలు అర్హులను గుర్తించకుండా కేవలం పార్టీ నాయకులు చెప్పిన వారికి దళితబంధు అమలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటివరకు కొన్నిగ్రామాలకు మాత్రమే పరిమితమైన పథకం మరికొన్ని గ్రామాలకు అమలు కాకపోవడంతో లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారన్నారు. వెంటనే అర్హులకు దళితబంధు అమలుచేసి వారిని ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం



ఊట్కూరు: మండల కేంద్రంలోని లయన్స్‌క్లబ్ ఆఫ్ ఇంటర్‌నేషనల్ డైరెక్టర్ లయన్ డాక్టర్ జి బాబురావు జయంతి సందర్భంగా ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎల్కోటి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. విద్యా, వైద్యం తదితర సామాజిక కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, హన్మంతు, శంకర్, డైరెక్టర్స్ బాల్‌రెడ్డి, భరత్, వసంత్, జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యటనను విజయవంతం చేద్దాం

నారాయణపేట:రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లాలో పర్యటన సందర్భంగా పేటనుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ అధ్యక్షుడు పి.శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు టీడీపీ కల్యాణ మండపం నుంచి డబుల్‌బెడ్రూంఇల్లు ఇవ్వాలని ప్రభుత్వం హామీని విస్మరించడాన్ని నిరసిస్తూ క్లాక్‌టవర్ వరకు ర్యాలీ నిర్వహిస్తారని తెలిపారు.

అల్పాహారం పంపిణీ



మక్తల్: స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వఆస్పత్రిలోని ఆదివారం బాలింతలకు, మున్సిపల్ కార్మికులకు లయన్స్‌క్లబ్ సభ్యులు అల్పాహారం పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ సమాజ సేవకోసం తమవంతు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో అంబాదాస్‌రావు, అంజన్‌ప్రసాద్, రిజియన్ చైర్మన్ రమేష్, నాగరాజు, శ్రీనివాసులు, శరణప్ప, రవికుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గుంతల మయంగా ఉజ్జెల్లిరోడ్డు



మాగనూర్: మండలంలోని నేరడగం మీదుగా ఉజ్జెల్లి గ్రామానికి వెళ్లే బీటీరోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నేరడగం నుంచి ఉజ్జెల్లివరకు వెళ్లేరోడ్డు అడుగు అడుగునా గుంతకావడంతో నీరునిండి గుంతలు కనిపించడం లేదని అంటున్నారు. గతంలో రోడ్డు మరమ్మతులు చేపడతామని అధికారులు తెలిపిన ఇప్పటివరకు ఎలాంటి పనులు మొదలు కాలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు బాగుచేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వం స్పందించాలి



కోయిల్‌కొండ: ప్రభుత్వం స్పందించి గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని జేఏసీ మండల కోకన్వీనర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆదివారం రిలేదీక్షలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మండల సాధనసమితి సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలి

దేవరకద్ర: ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని కోరుతూ ఆదివారం తెలంగాణ సమగ్ర శిక్షా కాంటాక్ట్ ఉద్యోగుల సంఘం నాయకులు అన్నాసాగర్‌లో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. జేఏసీ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి యాదగిరి, శేఖర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

మట్టిరోడ్ల దశ మారేనా?

- జీటీకి నోచుకుని పల్లెదారులు
- లింగారెడ్డిపల్లికి నిధులు మంజూరైనా సాగని పనులు
- ప్రతిపాదనలకే పరిమితమైన పిడెంపల్లి రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న ఆయాగ్రామాల ప్రజలు



లింగారెడ్డిపల్లి చెరువుకట్టపై గుంతలు పడిన మట్టిరోడ్డు

దామరగిద్ద: గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి మౌలిక సదుపాయాలు ప్రధానమైన రోడ్డు సౌకర్యం ఎంతో కీలకం. కాగా నేటికి పలుగ్రామాలకు మట్టి రోడ్ల దశ మారకపోవడంతో ప్రజలు పాట్లు పడుతున్నారు. మండలంలోని దాదాపు 30పంచాయతీలో మారుముల తాండాలు గ్రామ పంచాయతీలకు మొదలు 27పంచాయతీలకు రోడ్డు సదుపాయం కల్పించారు. కాగా మండల కేంద్రమైన దామరగిద్దకు లింగారెడ్డిపల్లి, పిడెంపల్లి గ్రామాలు ప్రధాన రోడ్డునుంచి నేటికి బీటీరోడ్డు సదుపాయానికి నోచుకోవడంలేదు. గతఏడాది క్రితం రూ. 90లక్షల సీఆర్ఆర్ నిధులతో బీటీ నిర్మాణానికి నిధులు మంజూరైంది. గతరెండేళ్ల క్రితం పిడెంపల్లికి రోడ్డునిర్మాణం చేపట్టాలని స్థానిక సర్పంచ్ చొరవతో ఎమ్మెల్యే ఆదేశాలతో బీటీరోడ్డు నిర్మాణానికి రూ. 2.49కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపిన నేటికి మంజూరు కాలేదని ప్రజా ప్రతినిధులు వాపోతున్నారు.



లింగారెడ్డిపల్లి-పిడెంపల్లి మధ్య గుంతలు పడిన రోడ్డు

నిలిచిన ఆర్టీసీ సేవలు..

మండలంలోని లింగారెడ్డిపల్లి మీదుగా పిడెంపల్లి వరకు తిరిగి కందెన్‌పల్లి గ్రామాలకు నడిపించే ఆర్టీసీ బస్సు సదుపాయం నిలిచిపోయింది. గ్రామాల మధ్యరోడ్డు చెరువు కట్టపై గుంతలు పడి అధ్వానంగా మారడంతో పిడెంపల్లికి బస్సుసౌకర్యం నిలిపివేశారు. ఈ రోడ్డు నిర్మాణం చేపడితే లోకూర్తి, మల్‌రెడ్డిపల్లి, నర్సాపూర్ మొగుల్‌మడ్క అన్నసాగర్ తదితర గ్రామాలకు 9కిలోమీటర్ల దూరం దగ్గనుంది.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి..



మండల కేంద్రానికి సమీపంలో ఉన్న తమ గ్రామానికి రోడ్డు సదుపాయం లేదు. ప్రధాన రహదారి నుంచి కిలోమీటరు దూరం ఉండగా ఇటు పిడెంపల్లికి రెండు కిలోమీటర్ల దూరం ఉంది. రోడ్డు చెరువు కట్టపై గుంతలుపడి వహనాల రోకపోకలు నిలిచిపోయాయి. నిధులు మంజూరయ్యాయని అధికారులు చెబుతున్న టెండర్ వేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదరు.

– మొగులప్ప, బీకేఎస్ నాయకులు పిడెంపల్లి

సౌకర్యం కల్పించాలి..



ప్రధాన రహదారినుంచి మూడు కిలోమీటర్ల దూరం ఉన్న తమ గ్రామానికి మట్టిరోడ్డే శరణ్యమైంది. ప్రధాన రోడ్డు నుంచి బీటీ మంజూరు చేస్తే రవాణా ఇబ్బందులు తొలగిపోతాయి. అధికారులు చొరవ తీసుకొని రోడ్డు మంజూరుచేసి సౌకర్యం కల్పించాలి.

– వీరప్ప, మాజీ సర్పంచ్, పిడెంపల్లి

కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు..

లింగారెడ్డిపల్లి గ్రామానికి రోడ్డు నిర్మాణానికి సీఆర్ఆర్ నిధులతో రూ. 90 లక్షలు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో రోడ్డు నిర్మాణం ప్రక్రియ ముందుకు సాగడంలేదు. టెండర్ రాగానే పనులు చేపడుతాం. పిడెంపల్లిరోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం.

– నర్సింగ్‌రావ్, ఏఈ పీఆర్, దామరగిద్ద

బాధితులను ఆదుకుంటాం



సాయం చేస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

మక్తల్: నియోజకవర్గ పరిధిలో అకాల వర్షాలకు ఇళ్లుకూలిపోయిన బాధిత కుటంబాలను ఆదుకుంటానని బీఆర్ఎస్ నాయకుడు వర్కటం జగన్నాథ్ రెడ్డి అన్నారు.ఆదివారం మండల పరిధిలోని బాధిత కుటుంబాల ఇళ్లను పరిశీలించారు. అనంతరం ఒక్కొక్కరికీ రూ.5 వేలు నగదుతోపాటు నిత్యావసరసరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాంలింగప్ప, ఉపసర్పంచ్ మారుతి, డీలర్ వెంకటేష్, రమేష్, చెన్నప్ప పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి సహకరిస్తా..

ఆత్మకూర్: ముసురు వాన కారణంగా నివాసముంటున్న గుడిసె కూలిపోయి రోడ్డున పడ్డ కుటుంబానికి ఆర్థికంగా సహకరించి వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి అండగా నిలిచారు. మండలంలోని పిన్నంచర్ల సువర్ణ, రాజు దంపతులు కూలి పనులు చేసుకుంటూ గుడిసెలో నివాసముంటున్నారు ముసురు వానతో గుడిసె కూలిపోవడంతో నిరాశ్రులయ్యారు. విషయం తెలుసుకున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఇంటి నిర్మాణం కోసం పూర్తిగా సహకరిస్తానని భరోసానిచ్చారు. రూ.75 వేలతో రేకులు, ఇటుకలు, సిమెంటు ఇతర సామగ్రిని అందజేస్తామన్నారు. ముందస్తుగా రూ.5వేలు నగదు, నెలకు సరిపడా సరుకులను అందించారు. కార్యక్రమంలో కుర్మన్న, మాసన్న, నారాయణ, ఖాజన్న, సత్యన్న, శివ, నరేష్, కళ్యాణ్ తదితరులు ఉన్నారు.

అమరచింత: వర్షాల కారణంగా మట్టిమిద్దెలు కూలిన బాధితులను వీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదుకుంటామని ఆ సంస్థ నిర్వాహకుడు వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎంగలి నాగమణి, కాడ్గి లక్ష్మణ్ ఇళ్లు వర్షాలకు కూలిపోవడంతో వారిని వర్కటం పరామర్శించారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను అందిస్తామని భరోసా కల్పించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వర్షాలకు కూలిన ఇళ్లను పరిశీలించి బాధితులకు తమ సంస్థ ద్వారా చేతనైన సహాయం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వెంకటేష్‌గౌడ్, నాగరాజ్, అభిరామ్, అఖిల్, రాజేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

గోశాలలో అధికమాసం పూజలు



గోశాలలో అధికమాసం పూజలు చేస్తున్న పురోహితులు

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని శక్తిపీఠం సురభి గోశాలలో ఆదివారం అధిక శ్రావణశుద్ధ ద్వాదశిని పురస్కరించుకుని పట్టణ ఆర్యవైశ్య మహిళాసంఘం ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు చేశారు. అధికమాసం సందర్భంగా గోమాతలకు పూజించి నైవేద్యం సమర్పించారు. అంతకుముందు పండితులు బ్రహ్మశ్రీ ఉట్కూర్ విభావసు పురోహిత్ అగ్నిహోత్రి శాస్త్రోక్తంగా అధికమాస సంకల్పం, గణపతి, లక్ష్మి నారాయణ, గోపూజలు చేశారు. పట్టణ ఆర్యవైశ్య మహిళలందరూ సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం చేపట్టారు. కార్యక్రమంలో పాలాది సుప్రియ, కవిత, నాగలక్ష్మి, దోమవాణి, విజయ, అరుణ, గీతా, సవిత, ఇందిర, వెంకటలక్ష్మి, బాలామణి, త్రివేణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వడ్డెర సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన సభ్యులు

నారాయణపేట టౌన్: జిల్లాకేంద్రంలోని పోలేపల్లి పాతఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జిల్లా వడ్డెరసంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎర్రమంజలి దత్తు, గౌరవ అధ్యక్షుడిగా వెంకట్రాములు, ఉపాధ్యక్షుడిగా జెరిపటి వెంకటరాములు, ప్రధాన కార్యదర్శిగా వేముల గంగప్ప, కో-శాధికారిగా గుంజ కృష్ణ, మహిళా విభాగం అధ్యక్షురాలుగా ఎర్ర మంజలి, సత్యమ్మను ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బండారి వెంకటస్వామి మాట్లాడుతూ.. వడ్డెరులను ఎస్టీ జాబితలో చేర్పించాలని, జిల్లా కేంద్రంలోని వడ్డెర సంఘం భవనానికి స్థలం కేటాయించాలని, వాటికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాప్రధాన కార్యదర్శి గువ్వానోని రాములు, డైరెక్టర్ చెన్నయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ దాసర్ల భూమయ్య, వెంకటేష్, చంద్రయ్య, శ్రీశైలం పాల్గొన్నారు.

ఇథనాల్ కంపెనీతో ప్రమాదం



దీక్షలోమాట్లాడుతున్న రత్నం

మరికల్: చిత్తనూర్ వద్ద ఇథనాల్ కంపెనీ నిర్మించడంతో రైతుల పంటపొలాలు దెబ్బ తింటాయని ప్రొఫెసర్ కె.వై రత్నం అన్నారు. చిత్తనూర్ ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా గ్రామస్తులు చేపట్టినరిలే దీక్షలు ఆదివారం నాటితో నెలరోజులకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇథనాల్ కంపెనీనుంచి వెలువడే కాలుష్యం కారణంగా మనుషులతోపాటు, మూగజీవాలు అనారోగ్యం బారినపడే అవకాశం ఉందన్నారు. అలాగే సాగు, తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రజాఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం, అంబయ్య, కేఎస్‌పీఎస్ ఉమ్మడి జిల్లాఅధ్యక్షుడు చంద్రశేఖర్, వెంకట్రాములు, సుదర్శన్, చక్రవర్తి, లక్ష్మయ్య, రామచంద్రయ్య, ఆనంద్, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నదీతీర ప్రాంతంలో అప్రమత్తం

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ కర్ణాటక రాష్ట్రం నుంచి వరద చేరుతుండడంతో దిగువకు నీటిని వదులుతున్నారు. నదీతీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సింధూజ అన్నారు. మండలంలోని రేచింతల, జూరాల, వీరరాఘవపూర్, ఆరేపల్లి, కత్తేపల్లి, తూంపల్లి, మెట్లంపల్లి, గుంటిపల్లి గ్రామాల రైతులు, మత్స్యకారులు నది సమీప ప్రాంతాలకు వెళ్లకూడదని సూచించారు. ప్రమాదాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.

నత్తనడకన పనులు



మరికల్: మండలంలోని పస్పులశివారులో కస్తుర్బా గాంధీ పాఠశాల నిర్మాణపనులు రెండేళ్లనుంచి నత్తనడకన కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలో అద్దెభవనం లేక ధన్వాడ కస్తుర్బాలో మరికల్ కస్తుర్బాను కొనసాగిస్తున్నారు. దీంతో ఒకేపాఠశాల గదుల్లో రెండు కస్తుర్బాలను కొనసాగించడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. ఆగస్టు 15లోపు భవన నిర్మాణపనులు పూర్తిచేసి పాఠశాలకు అప్పగించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ ఏడాది చివరి వరకైనా నిర్మాణాలు త్వరగా పూర్తిచేసి భవనాన్ని పాఠశాలకు అప్పగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కరాటే టోర్నీలో విద్యార్థుల ప్రతిభ



మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని ఫలక్‌నుమాలో ఆదివారం జరిగిన జాతీయస్థాయి కరాటే టోర్నీలో కింగ్‌షోటోకాన్ కరాటే క్లబ్ విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు క్లబ్ ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ తెలిపారు. ఈ పోటీల్లో ఆయా విభాగాల్లో బంగారు, రజత పతకాలు సాధించినట్లు వివరించారు. ఈ మేరకు విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ముమ్మరంగా వరినాట్లు



వరి నాట్లువేస్తున్న కూలీలు

మాగనూర్: ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలు రెండురోజులుగా విరామం ఇవ్వడంతో రైతులు వ్యవసాయపనుల్లో నిమగ్నమయ్యారు. కొందరు రైతులు ట్రాక్టర్లతో పొలాలను దున్నిస్తుండగా మరికొందరు వరినాట్లు వేస్తున్నారు. వ్యవసాయ పనుల్లో సందడి నెలకొంది. మండలంలో 9వేల వరకు వరి పంట సాగుచేస్తారని అంచనవేస్తున్నారు. పంటల సాగువిషయంలో రసాయన మందుల పిచికారి విషయంలో రైతులు అధికారులను అడిగి సందేహాలు నివృత్తిచేసుకోవాలని సంబంధిత వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



ఇంటింటిప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నర్వ: యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం పాథర్చేడ్‌లో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ. 2 లక్షల రుణామాఫీ, వృద్ధాప్య పింఛన్ రూ.4 వేలు, 2 లక్షలు ఉద్యోగాల కల్పన చేపడుతుందన్నారు. ఇంటిస్థలం ఉన్నవారికి రూ. 5లక్షలు నిర్మాణానికి అందిస్తామన్నారు. ప్రజలు సంక్షేమపథకాలను అందించే కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తులసిరాజు, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎంపీటీసీ నీరజ్, నాయకులు కొండన్న, మహేష్, వెంకటేశ్వర్‌రెడ్డి, సంజీవరెడ్డి, శరణప్ప, వెంకటేష్ పాల్గొన్నారు.

పొరపాట్లు లేకుండా ఓటరు జాబితా



మాట్లాడుతున్న ఆర్డీఓ అనిల్‌కుమార్

మహబూబ్‌నగర్ రూరల్: శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ అనిల్‌కుమార్ కోరారు. ఆదివారం మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో డీఎస్పీ మహేష్, తహసీల్దార్లు, పోలీసు అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ జాబితాలో పొరపాట్లు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. 18 ఏళ్లు పూర్తి చేసుకున్న వారు సెప్టెంబర్ 19 వరకు నమోదుకు అవకాశం ఉందని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బూత్ స్థాయి అధికారులు ఉంటారని పేర్కొన్నారు. అక్టోబర్ 4న తుది జాబితాను విడుదల చేస్తామని తెలిపారు. జిల్లాలో కొత్తగా ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. గ్రామాల్లో సంచార వాహనాల ద్వారా ఈవీఎం యంత్రాలపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో మహబూబ్‌నగర్ అర్బన్, రూరల్ మండలాల తహసీల్దార్లు బి.పార్థసారథి, పాండు, రూరల్ సీఐ స్వామి, ఎస్సై వెంకటేశ్వర్లు, గిర్దావర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

కుంటశిఖం.. అన్యాక్రాంతం

- ఫిర్యాదు చేసిన ఫలితం శూన్యం
- రెవెన్యూ అధికారులకు ఇప్పటికే వినతిపత్రాలు అందజేత
- నష్టపోతున్న మత్స్యకారులు
- సర్వేచేసి హద్దులు ఏర్పాటుచేయాలని వేడుకోలు



అమ్మపల్లి గ్రామ చెరువు

మాగనూర్: విలువైన ప్రభుత్వ భూములు అక్రమార్కులకు ఫలహారంగా మారిపోతున్నాయి. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను కబ్జాచేసి తమ పట్టా భూమిగా మార్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు తూతూమంత్రంగా సర్వేచేసి హద్దులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రభుత్వభూమి కనుమరుగవుతోంది. ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు విన్నవించుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు.

విన్నవించిన ఫలితాలు శూన్యం..

గ్రామస్తులు గతకొన్నినెలలుగా తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లి వినతిపత్రాలు అందజేసిన ఫలితం మాత్రం శూన్యమని అంటున్నారు. వడ్వాట్, అమ్మపల్లి గ్రామానికి చెందిన కొందరు రైతులు సుమారుగా 18ఎకరాల మేర భూమి కబ్జాకు గురైంది.రెవెన్యూ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించడంతోనే ప్రభుత్వ భూములు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్తున్నాయంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత రెవెన్యూ అధికారులు స్పందించి విలువైన భూములను కాపాడాలని కోరుతున్నారు.

హద్దుల ఏర్పాటులో నిర్లక్ష్యం..

చెరువుల శిఖం భూములకు హద్దులు ఏర్పాటు చేయడంలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. మండలంలోని అన్ని చెరువులలో సర్వేచేసి శిఖం భూముల హద్దులను గుర్తించి ట్రాంచ్ కొట్టించి హద్దుల ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వభూములు కాపాడాలి..



కబ్జాకు గురైన అమ్మపల్లి చెరువు భూమిపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలి. గతంలో ఉన్న తహసీల్దార్‌లకు చాలా సార్లువినతిపత్రాలు అందజేసిన ఫలితం మాత్రం లేకుండా పోయింది. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి సర్వేచేయాలి.

– బాలకృష్ణ, రైతు, అమ్మపల్లి

పట్టించుకోవడం లేదు..



శిఖం భూములను కొందరు 18ఎకరాల వరకు భూమి కబ్జాకు గురైన సంబంధిత అధికారుల నుంచి కనీస స్పందన లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. చెరువు శిఖం అక్రమణపై ఉన్నతాధికారులు దృష్టిసారించి ప్రభుత్వ భూమిని కాపాడాలి.

– కృష్ణ, మత్స్య పారిశ్రామికశాఖ గ్రామ అధ్యక్షుడు

పరిశీలిస్తాం..



అమ్మపల్లి చెరువుకుంటశిఖం అక్రమణ అంశంపై తన దృష్టికి రాలేదు. గ్రామస్తులు సమస్యను తనదృష్టికి తీసుకొస్తే ప్రభుత్వ భూమి అక్రమణ జరిగిందా లేదా అనే అనే అంశాన్ని పరిశీలిస్తాం.

– అమీర్, ఇంచార్జి తహసీల్దార్, మాగనూర్

లయన్స్, లియో క్లబ్‌ల ఆధ్వర్యంలో అన్నదానం

స్టేషన్ మహబూబ్‌నగర్: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబురావు ఘట్టమనేని జన్మదినం సందర్భంగా ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ మహబూబ్‌నగర్, లియో క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 500 భోజన ప్యాకెట్లను పట్టణంలో నిరుపేదలకు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు శ్రీహరి, గోవర్ధన్, మృత్యుంజయ, పి.అశోక్‌కుమార్, లియోక్లబ్ అధ్యక్షుడు ఫణింద్ర, ఉపాధ్యక్షులు భరత్, కార్యదర్శి మోహన్, కోశాధికారి భీమేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.